



అశ్వారావుపేటకు సరిహద్దున ఉన్న ఏలూరు జిల్లా కామయ్యపాలెంలో కోడిపందెం

కోడి పందేలకు ఫిదా

- ఏపీ సరిహద్దుల్లో మూడు రోజులపాటు జోరుగా సాగిన కోడిపందేలు
- ఉమ్మడి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో తరలివెళ్లిన పందెంరాయుళ్లు
- ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు వాహనాల బారులు
- రేయింబవళ్లు సాగిన పందేలు.. చేతులు మారిన కోట్ల రూపాయలు
- అదనంగా పేకాట, గుండాట, కోతముక్క జూదాలు..
- ఏరులై పారిన మద్యం... పసందైన వంటకాల జోరు..
- ఈసారి పందేలలో మహిళలు సైతం..

సత్తుపల్లి రూరల్/అశ్వారావుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల వేళ ఏపీలో కోడిపందేలు జూలు విదిల్చాయి. మూడు రోజులపాటు పలు ప్రాంతాల్లో రాత్రింబవళ్లు జాతరలా సాగిన పందేలలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు మండలాలకు ఏపీ ప్రాంతాలు సరిహద్దున ఉండటంతో కోడిపందేల ప్రభావంతో పాటు.. అందుకు సంబంధించిన సందడి ఇక్కడా కనిపించింది. సరిహద్దు గ్రామాల్లో ఏర్పాటుచేసిన పందేలలో పాల్గొనేందుకు, వాటిని సరదాగా చూసేందుకు సత్తుపల్లి, కల్లూరు, వేంసూరు, పెనుబల్లి, తల్లాడ, దమ్మపేట, అశ్వారావుపేట తదితర మండలాల నుంచి పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఈసారి గతేడాది కంటే ఎక్కువగా బిరులు ఏర్పాటు చేయడంతో పందెం రాయుళ్లు కోడిపుంజులతో ఉత్సాహంగా తరలివెళ్లారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో కోడిపందేలు చాలాచోట్ల కొనసాగాయి. కోళ్ల కాళ్లకు కత్తులు కట్టి పందేలు ఆడకూడదని ఎంత హెచ్చరించినా.. ఆ హెచ్చరికలను తుంగలో తొక్కి రక్తపాతాన్ని సృష్టించారని చెబుతున్నారు. ఒక్కో పందెం లక్షల్లోనే జరిగినట్లు (మిగతా 6వ పేజీలో)

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయబోతున్న నాలుగు సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికకు రంగం సిద్ధమైంది. అనర్హులకు ప్రభుత్వ పథకాలు అందిస్తే కలెక్టర్ స్థాయినుంచి కిందిస్థాయి వరకు చర్యలు ఉంటాయని ఇటీవల సమీక్ష సమావేశంలో మంత్రులు హెచ్చరించిన నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక అధికారులకు కత్తిమీద సాములా మారింది. 26వ తేదీ నుంచి అమలు చేయబోతున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, తెల్లకార్డుల పంపిణీ పథకాలు.. అర్హులకు మాత్రమే అందాలని ఇటీవల ఉమ్మడి జిల్లాలోని అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు అధికారులకు దిశా నిర్దేశం చేశారు.



- నేటినుంచి 'సంక్షేమ' లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ
- క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించనున్న బృందాలు
- రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీపై కసరత్తు
- 21నుంచి 24వరకు గ్రామసభలు
- ఎంపిక ప్రక్రియలో ఇందిరమ్మ కమిటీలకు భాగస్వామ్యం
- అనర్హులను ఎంపిక చేస్తే చర్యలు తప్పవని మంత్రుల హెచ్చరిక
- అధికారులకు కత్తిమీద సాములా లబ్ధిదారుల ఎంపిక బాధ్యత

సర్వే సవాల్

ఖమ్మం జనవరి 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి నాలుగు పథకాలు అమలు చేయబోతున్న నేపథ్యంలో ఇరు జిల్లాల కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి పాటిల్ జిల్లాలో క్షేత్ర స్థాయి సర్వేలకు కార్యాచరణ రూపొందించారు. అందులో భాగంగా గురువారం నుంచి 20వ తేదీ వరకు గ్రామస్థాయిలో పంచాయతీ, రెవెన్యూ, అగ్రికల్చర్, హౌసింగ్ బృందాలు, అధికారులు, ఉద్యోగుల బృందాలు సర్వే నిర్వహించనున్నాయి. 21నుంచి 24వరకు గ్రామసభలు నిర్వహించి గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితాలను ప్రకటించటం, 26న రిపబ్లిక్ డే సందర్భంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించటం జరుగుతుంది.

రైతు భరోసా ఇలా..

గతంలోని రైతుబంధుకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని అమలు చేయబోతోంది. ఈ పథకంలో భాగంగా ఏడాదికి ఎకరాకు రూ.12వేలు సాగు సాయం అందించాలని నిర్ణయించింది. వానాకాలం రూ.6వేలు, యాసంగికి రూ.6వేలు అందించనున్నారు. ఖమ్మం జిల్లా పరిధిలో 3,42,803 రైతులుండగా 7,40,615 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించారు. గతంలో వీటికి రైతుభరోసా అందించారు. ఈ రైతులను ఐదు కేటగిరీలుగా గుర్తించింది. అయితే గతంలో ధరణి పాస్‌పుస్తకాల ఆధారంగా నేరుగా రైతుల ఖాతాల్లో ఏడాదిలో ఎకరానికి రూ.10వేలు వేశారు. ఇప్పుడు గ్రామాల్లో సాగు యోగ్యత ఉన్న భూమికి మాత్రమే రైతుభరోసా అందించనున్నారు. గతంలో ధరణి కింద కొండలు గుట్టలు, ప్రభుత్వ అవసరాలకు భూసేకరణ చేసిన భూములు, రియల్ ఎస్టేట్‌గా మారిన ప్రైవేటు భూములకు సైతం రైతు బంధు అందింది. ఇప్పుడు గ్రామస్థాయిలో సర్వే బృందాలు సాగులో లేని భూములను, పట్టా ఉండి భూమిలేని వాటిని గుర్తించాల్సి ఉంటుంది. దాంతో 10 నుంచి 15 శాతం భూములకు రైతుభరోసా వచ్చే అవకాశం ఉండదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,84,014 మంది రైతులు ఉండగా, 5,09,966.82 ఎకరాలకు గతంలో రైతుబంధు ఇచ్చారు. ఇక్కడ కూడా చాలా భూములు రియల్ వెంచర్లుగా మారాయి. రోడ్లు, పరిశ్రమల నిర్మాణం కోసం భూసేకరణలోకి వెళ్లి పోయాయి. వీటికి కూడా ఈసారి రైతుభరోసా తొలగించనున్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా..

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు ఉండి, ఏడాదిలో 20 రోజులు ఉపాధి పనులకు వెళ్లిన భూమిలేని వ్యవసాయ కూలీలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఏడాదికి రూ.12వేలు రెండు విడతలుగా ఇస్తారు. ఖమ్మం జిల్లా పరిధిలో 3,06,404 మంది కూలీలకు జాబ్‌కార్డులు ఉండగా 1,73,421 మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,19,006 జాబ్‌కార్డులు ఉండగా 1,35,946మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఇందులో 2,28,269 జాబ్‌కార్డులకు సంబంధించిన కూలీలు పనులు నిర్వహించారు. వీరిలో అర్హులను గుర్తించాల్సి ఉంది. డీఆర్‌డీఏకు సంబంధించిన మండల, గ్రామస్థాయి బృందం అర్హులను గుర్తించే పనుల్లో ఉంది.

అర్హులకు రేషన్ కార్డులు..

దశాబ్ద కాలం తరువాత పేదలకు ప్రభుత్వం రేషన్ కార్డులను అందించబోతోంది. ఎన్నోఏళ్లుగా ఎంతో మంది రేషన్‌కార్డుల (మిగతా 6వ పేజీలో)



తగలబడుతున్న పత్తి బస్తాలు

వ్యవసాయ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

- సుమారు 400 బస్తాల ఆహుతి
- రూ.14 లక్షల వరకు నష్టం
- షార్ట్ సర్క్యూటే కారణమని అనుమానాలు
- ఫైరింజన్ లేని మార్కెట్

ఖమ్మం మార్కెట్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షెడ్లలో నిల్వ ఉంచిన ఇద్దరు వ్యాపారులకు చెందిన సుమారు 400 పత్తి బస్తాలు అగ్నికి ఆహుతయ్యాయి. సదరు వ్యాపారికి (మిగతా 6వ పేజీలో)

స్వగ్రామంలో తుమ్మల సందడి

సంక్రాంతి వేళ గ్రామస్థులతో ఆత్మీయంగా మాటామంతీ



గండుగులపల్లిలో పలువురిని పలకరిస్తూ... 6

ఎన్టీఆర్ వ్యక్తి కాదు.. సామూహిక శక్తి

- తెలుగుజాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు
- టీడీపీ అధికార ప్రతినిధి, టీటీడీ సభ్యుడు నర్సిరెడ్డి
- కాకర్ల గ్రామంలో ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



కాకర్లలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నర్సిరెడ్డి తదితరులు 6

భద్రాద్రిలో భక్తజన సందోహం

- ఆరు రోజుల్లో రూ.45 లక్షల ఆదాయం
- స్వామివారిని దర్శించుకున్న అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్
- వైభవంగా సాగిన రథ సేవ 6

20న ఏఏఐ బృందం రాక

- కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై సర్వే
- రామవరం గరీబ్‌పేట ప్రాంతంలో 950 ఎకరాలు సిద్ధం
- ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం 7

శవమై తేలిన సంజయ్...

- రెండు రోజుల క్రితం అర్ధరాత్రి నగరంలో అదృశ్యం
- దుండగులు ఓ యువతిని చంపారని, తననూ చంపుతున్నారని వాయిస్ మెసేజ్
- గాలింపులు చేస్తుండగానే.. సాగర్ కాలువలో విగతజీవిగా లభ్యం
- మృతదేహంతో రోడ్డుపై కుటుంబ సభ్యుల ధర్నా
- ఎలా మృతిచెందాడనే దానిపై లభ్యంకాని క్లూ
- హత్య, ఆత్మహత్య కోణంలో పోలీసుల దర్యాప్తు



సంజయ్ (ఫైల్)



సంజయ్ మృతదేహం



ధర్నా నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు, స్థానికులు

ఖమ్మం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం ఖమ్మం నగర శివారులో అదృశ్యమైన యువకుడు.. చివరకు శవమై కనిపించాడు. అతడి మృతదేహం మంగళవారం సాగర్ కాలువలో లభ్యమైంది. అయితే అతడి మృతి వెనుక ఉన్న మిస్టరీ మాత్రం వీడలేదు. ఈ సంఘటన నగరంలో తీవ్ర సంచలనం సృష్టించగా, బాధిత కుటుంబం కన్నీరు మున్నీరవుతోంది.

ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లి పరిధిలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతానికి చెందిన పందెపు హనుమంతరావు, మమత దంపతులకు జ్ఞానసాయి, సంజయ్‌కుమార్ (22) అనే ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు జ్ఞానసాయి హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు సంజయ్‌కుమార్ కూడా అన్న వద్దనే ఉండి చదువుకుంటున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా సంజయ్‌కుమార్ గత ఆదివారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వచ్చాడు. అదేరోజు అర్ధరాత్రి (తెల్లవారితే సోమవారం) అతడి అన్న జ్ఞానసాయి కూడా హైదరాబాద్ నుంచి ఖమ్మం వస్తుండడంతో అతడిని రిసీవ్ చేసుకునేందుకు ఖమ్మం బస్టాండ్‌కు వెళుతున్నానని ఇంట్లో చెప్పి ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో బైక్‌పై బయటికి వెళ్లాడు. కొంతసేపటి తరువాత తనను ఓ ఆటో ఢీకొట్టిందని తండ్రి హనుమంతరావుకి ఫోన్ చేసి చెప్పాడు. అనంతరం మరికొంత సమయానికి సాగర్ కాల్వకట్టపై ఆటోలో ఓ అమ్మాయిని చంపారని, తనను కూడా చంపుతున్నారని అన్న జ్ఞానసాయి ఫోన్‌కు వాయిస్ మెసేజ్ పంపించాడు. ఆ తరువాత సంజయ్ ఫోన్ స్విచ్‌ఆఫ్ అయింది. దీంతో కుటుంబ సభ్యులు, కాలనీ యువకులు మున్నేరు, సాగర్ కాలువ కట్టపైకి వెళ్లి గాలించగా సంజయ్‌కుమార్ బైక్ కనిపించింది. కానీ అతడు కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

సాగర్ కాల్వలో మృతదేహం

ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత సంజయ్‌కుమార్ అదృశ్యం కాగా, (మిగతా 6వ పేజీలో)

అంబరాన్నంటిన సంక్రాంతి సంబురాలు

- పల్లెపట్నంలో మూడు రోజుల పాటు సందడే సందడి
- కనుమ నాడు పూజలందుకున్న పశువులు

ఖమ్మం సాంస్కృతికం/కొత్తగూడెం సాంస్కృతికం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సంబురాలు ఉమ్మడి జిల్లాలో అంబరాన్నంటాయి. ఊరూరా పిల్లలు, యువతీయువకులు గాలిపటాలను ఎగురవేశారు. ఖమ్మం తదితర నగరాలు, ఇతర పట్టణాల నుంచి పల్లెలకు జనం తరలివెళ్లడంతో పల్లెలు నిండుతనాన్ని సంతరించుకున్నాయి.. తమ స్వగ్రామాలను విడిచి ఉద్యోగం, వ్యాపారాల కోసం పట్టణాలు, నగరాలకు వలస వచ్చిన వారు తమ ఊళ్లను వెతుక్కుంటూ పోయి పండుగల్లో పాల్గొన్నారు. దీంతో రెండు రోజుల పాటు ఖమ్మం తదితర ముఖ్య పట్టణాల రోడ్లు వెలవెలబోయాయి.


పతంగులు ఎగురవేస్తున్న దృశ్యం

జిల్లాకు సరిహద్దుగా ఆంధ్రా ప్రాంతాలు ఉండటంతో సంస్కృతి మిశ్రమంగా మారి సంక్రాంతి సందర్భంగా ఆంధ్ర ప్రాంతాలకు దీటుగా జిల్లాలో పండుగ ఉత్సాహం వెల్లివిరిసింది. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, భోగి మంటలు, చెరకు గడలు, పాలపొంగుల రంగురంగుల గాలి పటాల సరదాలతో సంకురాత్రి సరదాగా గడిచింది. లంగా ఓణీలు, పంచెకట్టు, లాల్చీలు, తదితర సంప్రదాయ దుస్తులను ధరించేందుకు ఆసక్తి చూపారు. ఇళ్ల ముందు పెద్దపెద్ద ముగ్గులు వేసి మహిళలు వాటికి ఓపికగా రంగులద్ది గొబ్బెమ్మలు, రేగుపళ్లను, తదితర పూజా సామగ్రితో అలంకరించారు.

తెల్లవారుజామునుంచే దేవాలయాలను సందర్శించటంతో ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. అనంతరం బంధుమిత్రులతో పిండి వంటల విందువినోదాలతో గడిపారు. అరిసెలు, పొంగళ్లు తదితర పండుగ రుచులను బంధుమిత్రులకు పంచుతూ పండుగ పరమార్థాన్ని చాటారు. సంక్రాంతి అంటే పాడి పంట, ప్రకృతితో మేమేకం కావటం కనుక బుధవారం కనుమ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులను రంగులతో అలంకరించి పూజలు చేశారు.. ఆవులు, ఎద్దులు, దూడలపైన గుక్కా రంగులు చల్లి, కొమ్ములను, ఎడ్ల బండ్లను రంగులతో అలంకరించారు.


చింతకాని మండలం పాతర్లపాడులో పశువులకు పూజలు


బైక్‌పై మోడ్రన్ హరిదాసు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో.....

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ సంబరాలు అంబరాన్నంటాయి. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పల్లె, పట్టణాల్లో తెలుగు ముంగిళ్లన్నీ రంగు రంగుల ముగ్గులతో కళకళలాడాయి. కుల, మతాలకు అతీతంగా సంక్రాంతి సంబరాల్లో పాల్గొని చిన్న, పెద్ద కలిసి గాలి పటాలను ఎగురవేస్తూ హోరెత్తించారు. మహిళలు వేసిన రకరకాల ముగ్గులు, గొబ్బెమ్మలు సంక్రాంతి వైభవాన్ని చాటిచెప్పాయి. తెల్లవారుజామునే తలంటూ స్నానాలు ఆచరించి సాంప్రదాయ దుస్తులను ధరించి పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో వేడుకగా నిర్వహించారు. సంక్రాంతి, కనుమ పండుగతో బంధుమిత్రులతో ఇళ్లన్నీ సందడిగా మారాయి. కనుమ సందర్భంగా రథం ముగ్గులు వేసి ఇతర వాకిళ్లకు అనుసంధానం చేస్తూ సంక్రుడికి వీడ్కోలు పలికారు. చిన్నారులు, యువతలు, యువకులు గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. రైతులు పశువులకు ప్రత్యేక పూజలు చేశారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కుటుంబసమేతంగా నూజివీడులో జరిగిన కోడిపందేలకు హాజరై తిలకించారు.



కొత్త అల్లుడికి 120రకాల వంటలు

వైరా, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ 12వ వార్డు గాంధీనగర్‌లో సంక్రాంతి పర్వదినాన మంగళవారం కొత్త అల్లుడికి 120 రకాల వంటలతో అత్తింటివారు భోజనాన్ని వడ్డించారు. అల్లుడు కొనకళ్ల సందీప్, కుమార్తె మధుశ్రీ దంపతులకు అత్తమామలు నందిగామ భాస్కర్‌రావు, సుజాత దంపతులు 120రకాల వంటకాలను ఏర్పాటుచేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం సుధాపల్లి గ్రామానికి చెందిన సందీప్‌తో మధుశ్రీకి ఇటీవల వివాహం జరిగింది. ఈ వివాహం తర్వాత తొలిసారి సంక్రాంతి పండుగకు వచ్చిన కొత్త అల్లుడికి అత్తమామలు 120 రకాల వంటలతో మర్యాదలు చేశారు. దీంతో అల్లుడు ఉబ్బితబ్బిబ్బైపోయాడు. తన పట్ల అత్తమామలు చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపాడు.


రథోత్సవం దృశ్యం


రామాలయంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్

రామాలయంలో భక్తుల సందడి

- వరుస సెలవులతో పెరిగిన భక్తుల తాకిడి
- ఆరు రోజుల్లో రూ.45లక్షల ఆదాయం
- స్వామిని దర్శించుకున్న అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్
- వైభవంగా రథోత్సవం

భద్రాచలం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామయ్య ఆలయానికి గత ఆరు రోజులుగా భక్తుల తాకిడి అధికమైంది. సంక్రాంతి సెలవులను పురస్కరించుకుని వరుసగా ఆరురోజుల పాటు వేలాది మంది భక్తులు రామయ్యను దర్శించుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు ముందుగానే భద్రాచలం చేరుకున్నారు. దీంతో దేవస్థానం పరిధిలోని కాటేజీలు, సత్రాలు పూర్తిగా భక్తులతో నిండిపోయాయి. అలాగే పట్టణంలోని వివిధ లాడ్జీలు సైతం భక్తులతో నిండిపోయాయి. కాగా రామయ్యకు గత ఆరు రోజులుగా రూ.45లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా మంగళవారం భద్రాద్రి రామయ్యను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య కుటుంబసభ్యులు దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా యాగశాలలో ప్రత్యేక హోమం నిర్వహించి పూర్ణాహుతి గావించారు. అనంతరం శ్రీసీతారామచంద్రస్వామిని మేళతాళాలతో రథం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక అలంకరణ చేసిన అనంతరం స్వామివారికి రథ సేవ నిర్వహించారు. ఈ సమయంలో వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అంతకుముందు ప్రణయ కలహోత్సవం నిర్వహించారు.

సంప్రదాయబద్ధంగా రాపత్తుసేవ

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రాపత్తు సేవలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఏపీలోని అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో నిర్వహించారు. బుధవారం గోదావరినది తీరంలోని పునర్వసు మండపంలో నిర్వహించారు. తొలుత స్వామివారిని ఆలయం నుంచి మేళతాళాలు, భాజభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ తీసుకొచ్చి వేదికపై స్వామివారిని ఆసీనులను చేశారు. అనంతరం స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, తదితర ప్రత్యేక పూజలు, వేద స్వస్తిని వైదిక సిబ్బంది నిర్వహించారు.

పూసుకుంటలో తుమ్మల మనుమడు

- పండుగ రోజు కొండరెడ్లతో గడిపిన ప్రయాగ్
- గత మార్చిలో పూసుకుంట, కటుకూరు గ్రామాల సందర్శన
- తమ సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్న గ్రామస్థులు

దమ్మపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): 'తాతయ్యతో చెప్పి ఎన్నో ఏళ్లుగా తీరని మా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేశాడు..' అంటూ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మనుమడు ప్రయాగ్‌ను పూసుకుంట గ్రామానికి చెందిన కొండరెడ్లు కొనియాడుతూ సత్కరించారు. మారుమూల అటవీప్రాంతంలో ఉన్న పూసుకుంట కొండరెడ్ల కుటుంబాలను మంగళవారం సంక్రాంతి పండుగరోజు ప్రయాగ్ సందర్శించి వారితో గడిపాడు. గతేడాది మార్చి 13న ప్రయాగ్ పూసుకుంట, కటుకూరు గ్రామాలను సందర్శించాడు. అప్పుడు గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలను తెలుసుకొని, వాటిని తన తాతయ్య దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చాడు. ఈ క్రమంలోనే మంత్రి తుమ్మల గత డిసెంబరులో పూసుకుంటను సందర్శించి సమస్యలు తెలుసుకొని సంక్రాంతిలోపు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ బోర్లు వేసి పామాయిల్ మొక్కలు నాటి అభివృద్ధి పనులను ఇటీవల మంత్రి తుమ్మల ప్రారంభించారు. బ్రిడ్జిలకు శంకుస్థాపన చేశారు.

ఈ క్రమంలో సంక్రాంతి పండుగ సెలవులకు గండుగులపల్లి వచ్చిన ప్రయాగ్.. మరోమారు పూసుకుంట గ్రామాన్ని సందర్శించి కొండరెడ్లతో గడిపి వారికి స్వీట్ ప్యాకెట్లను అందజేశాడు. 'మీ ద్వారా మా సమస్యలు పరిష్కారం అవుతున్నాయి..' అంటూ కొండరెడ్లు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో అనేకమంది వివిధ రకాల అనారోగ్యానికి గురవుతున్నారని తెలుపగా, తాతయ్యతో చెప్పి మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేయిస్తానని ప్రయాగ్ హామీ ఇచ్చాడు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రయాగ్‌ను సత్కరించారు. ప్రయాగ్ వెంట కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, తుమ్మల శేషుబాబు తదితరులు వున్నారు.


ప్రయాగ్‌ను సత్కరిస్తున్న పూసుకుంట వాసులు



ముగ్గువెంకటాపురంలో విచిత్ర ఫ్లెక్సీ

కల్లూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని ముగ్గువెంకటాపురంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఓ ఫ్లెక్సీ చర్చనీయాంశంగా మారింది. ఈ ఫ్లెక్సీలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, సినీ హీరో బాలకృష్ణ ఫొటోలతోపాటు సైకిల్, కారు గుర్తును ముద్రించారు. అలాగే చంద్రబాబు ఫొటో కింద బాస్ ఈజ్ బ్యాక్ అని, కేసీఆర్ ఫొటో కింద బాస్ ఈజ్ కమింగ్ సూన్ అని, బాలకృష్ణ ఫొటో కింద డాకు మహరాజ్ అని ముద్రించారు. అయితే స్థానికులు ఏ ఉద్దేశంతో ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారో పేర్కొనలేదు. మొత్తానికి పండుగ వేళ ఈ విభిన్న ఫ్లెక్సీ చర్చనీయాంశంగా మారింది.

స్వగ్రామంలో తుమ్మల సందడి

దమ్మపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన స్వగ్రామం గండుగులపల్లిలో మంగళవారం ఆత్మీయంగా గడిపారు. మంగళవారం ఉదయాన్నే తన వ్యవసాయ క్షేత్రాలను సందర్శించటంతో పాటు తనకు ఇష్టమైన పశువులతో కొంతసేపు గడిపారు. అనంతరం అదేగ్రామంలో వున్న తన సోదరులు జానకిరామయ్య, చెన్నారావు నివాసాలకు వెళ్లి కుటుంబసభ్యులను ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా పలువురు స్నేహితులు, బంధువులు వచ్చి తుమ్మలను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తుమ్మలను కలిసిన వారిలో బండి గుర్నాధరెడ్డి, దొడ్డా ప్రసాద్, పైడి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, పర్వతనేని అమరనాథ్, రాసూరి గంగరాజు, తిరుమలరావు, మోరంపూడి బాబురావు, సీతారామారావు తదితరులున్నారు. మరోవైపు తుమ్మల తనయుడు యుగంధర్ కూడా గ్రామంలో పలువురిని కలిసి ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తుమ్మల మనుమడు ప్రయాగ్ పూసుకుంటలో కొండరెడ్లతో గడిపాడు.

శవమై తేలిన సంజయ్...

(5వ పేజీ తరువాయి)

అతడి మృతదేహం మంగళవారం సాయంత్రం కొణిజర్ల మండలం తనికెళ్ల పరిధిలోని సాగర్ కాల్వ లాకులవద్ద లభ్యమైంది. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి సంజయ్ మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

న్యాయం చేయాలని ధర్నా

తమ కుమారుడిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని, హంతకులను వెంటనే అరెస్టు చేయాలని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సంజయ్ కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై సంజయ్ మృతదేహంతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సంజయ్ అదృశ్యమైన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదని ఆరోపించారు. పోలీసులు వెంటనే స్పందించి ఉంటే తమ కుమారుడు బతికేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కుటుంబ సభ్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం సంజయ్‌కుమార్ అంత్యక్రియలు పూర్తి చేశారు.

వీడని మిస్టరీ

సంజయ్ ఎలా మృతిచెందాడనేది మిస్టరీగా మారింది. ఎవరైనా హత్య చేశారా? లేక అతడే ఆత్మహత్య చేసుకుని ఉంటాడా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. సంజయ్ తన తన్నకు వాట్సాప్‌లో పంపిన వాయిస్ మెసేజ్ ప్రకారం ఆటోలో అమ్మాయిని అపహరించినట్టు కానీ, హత్య జరిగినట్టు కానీ పోలీసులకు ఇంతవరకు ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలుస్తోంది. ఈ విషయమై రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సంజయ్ అదృశ్యమైన వెంటనే నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామని, ఇంతలో సంజయ్ మృతదేహం తనికెళ్ల వద్ద సాగర్ కాలువలో దొరికిందని తెలిపారు. త్వరలోనే అన్ని ఆధారాలను సేకరించి బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని తెలిపారు.

కోడిపందేలకు ఫిదా

(5వ పేజీ తరువాయి)

సమాచారం. తెలంగాణ సరిహద్దుల్లో వున్న ఏపీలోని జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలోని కుక్కునూరు, చీరవెల్లి, ఏలేరు, వేలేరుపాడు, తాటాకులగూడెం, జీలుగుమిల్లి, కామయ్యపాలెం, అంకన్నగూడెం, శ్రీనివాసపురం, జంగారెడ్డిగూడెం, టీ నర్సాపురం, తడికలపూడి ప్రాంతాల్లో భారీగా పగలు, రాత్రుళ్లు కోడి పందేలు జరిగాయి. వీటితోపాటు తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు, చింతలపూడి తదితర ప్రాంతాల్లో సకల సౌకర్యాలతో భారీ సెట్టింగుల మధ్య కోడి పందేలు జరిగాయి. ఈ సారి పందేలలో మహిళలు సైతం పాల్గొన్నారు.

బిరులు ఏర్పాటు చేసిన ప్రాంగణంలో గ్యాంబ్లింగ్, పేకాట, మద్యం, మాంసం దుకాణాలతో పాటు పందెపురాయుళ్లకు ఉత్సాహం కలిగించేలా సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఒక్కో బరిలో రూ.50లక్షల నుంచి కోటికిపైగా ఒక్కోరోజు ఒక్కో విధంగా జరిగినట్టు చెపుతున్నారు.

పెద్ద పెద్ద బిరుల్లో ఒక్క రోజుకే కోట్లలో పందేలు జరిగినట్లు చెపుతున్నారు. పందేలతోపాటు వివిధ రకాల జూదాల ద్వారా భారీగా నగదు టర్నోవర్ జరిగింది. మద్యం వ్యాపారం భారీ ఎత్తున జరిగింది. కోడిపందేలలో పాల్గొనేందుకు తెలంగాణాలోని పందెపురాయుళ్లు మూడు రోజుల పాటు వివిధ రకాల వాహనాలలో ఏపీకి తరలిపోయారు. పందెపురాయుళ్లు, చూ డటానికి వెళ్లేవారు చాలామంది ఏపీకి తరలిపోవడంతో తె లంగాణాలోని సరిహద్దు గ్రామాలు ఖాళీగా కనిపించాయి.

కాగా, వైరాకు సరిహద్దులో ఉన్న ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని నెమలి, ఊటుకూరులకు వైరా ప్రాంత ప్రజలు ఎక్కువగా తరలివెళ్లి కోడిపందేలు ఇతర పోటీల్లో పాలుపంచుకున్నారు. మరికొంతమంది తిరువూరు, వత్సవాయి, విజయవాడ, గన్నవరం, భీమవరం, ఏలూరు తదితర ప్రాంతాలకు తరలివెళ్లారు. అలాగే ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల వాసులు కూడా ఈ మూడు రోజులు ఆంధ్రాకు తరలివెళ్లారు. ఇక్కడి సరిహద్దున ఏపీలో ఉన్న మొరుసమిల్లి, పొందుగుల, రుద్రవరం, జి.కొండూరు, గంపలగూడెం, తునికిపాడు, ఇనగడపలలో ఆంధ్రా ప్రభుత్వం బిర్రులకు అనుమతినిచ్చింది. దీంతో పెద్దసంఖ్యలో జనం తరలివెళ్లారు. బోనకల్ సరిహద్దు గ్రామమైన వత్సవాయిలో బిర్రులు నిర్వహించగా వాటిని వీక్షించేందుకు ప్రజలు తరలి వెళ్లారు.

మూడు రోజులపాటు మకాం...

భోగి, సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా తాతకుంట్ల, కొర్లమండ, మల్లేల, తిరువూరు, కాకర్ల, రాఘవాపురం, జనార్ధనవరం, నూజివీడు, విజయరాయి, దెందులూరు, పెద్దపాడు, పెద్దవేగి, కైకలూరు, ఉంగుటూరు, భీమవరం, పెద్ద అమిరం, ఉండి, ఆకివీడు తదితర ప్రాంతాలలో కోడిపందేల బిర్రులు భారీగా నిర్వహించారు. మూడు రోజులపాటు పందెంరాయుళ్లు మకాం వేసి మరీ పందేలలో పాల్గొన్నారు.

రూ.కోట్లలో పందేల జోరు

బిర్రుల వద్ద కోండిపందేలతో పాటు పేకాట, గుండాట, కోతముక్క శిబిరాలు నిర్వహించారు. కరెన్సీని లెక్కపెట్టేందుకు మనీ కౌంటింగ్ మిషన్లు కూడా తెచ్చి సకల సౌకర్యాలతో భారీగా ఏర్పాట్లు చేసినట్లు పందెంరాయుళ్లు చెబుతున్నారు. బిర్రుల పక్కనే కొన్నిచోట్ల మద్యం దుకాణాలు, భోజనాలు ఏర్పాటు చేశారు.

ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో రేయింబవళ్లు పందేలు నిర్వహించారు. ప్రత్యేకంగా డ్రోన్లు, అత్యాధునిక కెమెరాలతో వీడియో, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేయగా భారీ స్ర్కీన్లపై కోడిపుంజుల సమరాన్ని లైవ్ టెలికాస్ట్ చేశారు. అతిథులకు సరికొత్త రుచులు అందించేలా వంట మనుషులను ఏర్పాటు చేశారు.

మహిళామణులు సైతం..

ఈసారి పందేలకు మహిళలు కూడా తరలివెళ్లడం కనిపించింది. బ్యాగుల నిండా డబ్బులు తీసుకొచ్చి పందేలు వేయడం, బౌన్సర్లతో బందోబస్తు పెట్టుకోవడం కనిపించింది. అదేవిధంగా పందేలకు వచ్చేవారికి మందుతో పాటు విందు భోజనం, బసను కూడా కొన్నిచోట్ల ఏర్పాటు చేశారు. పందేలలో కొందరు డబ్బులు పోగొట్టుకోగా, మరికొందరు జేబులు నింపుకొన్నట్లు సమాచారం. మొత్తమ్మీద ఏపీ ప్రాంతాల్లో సాగిన కోడిపందేలు.. సరిహద్దున వున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా గ్రామాల్లో ఉత్కంఠను, సందడిని సృష్టించాయి.

సర్వే సవాల్

(5వ పేజీ తరువాయి)

కోసం దరఖాస్తులు ఇచ్చి ఎదురు చూస్తున్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శితో పాటు ఇతరులు సర్వే నిర్వహించి అర్హులను గుర్తించాల్సి ఉంది. ఇప్పటికే ప్రజాపాలనలో నిర్వహించిన కులగణనలో రేషన్ కార్డులు లేనివారి వివరాలను కూడా సేకరించారు. ఖమ్మం జిల్లా పరిధిలో ఇప్పటి వరకు 4,11,143 రేషన్ కార్డుల ద్వారా పేదలకు బియ్యాన్ని అందిస్తున్నారు. జిల్లాలో రేషన్‌కార్డులు లేనివారినుంచి 30,665 దరఖాస్తులు రాగా 22,834 దరఖాస్తులు పరిశీలనలో గుర్తించారు. మరో 10,884 కార్డులను పేరుమార్పులకు వచ్చాయి. ఇందులో సుమారు 4,963 దరఖాస్తులకు ఆమోదం లభించింది. వీటన్నింటినీ గ్రామస్థాయి బృందాలు తనిఖీ చేసి అర్హులైన పేదలను గుర్తించబోతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,93,263 కార్డుల ద్వారా రేషన్‌బియ్యాన్ని అందిస్తున్నారు. కాగా రేషన్‌కార్డులు కావాలని 43,061 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 20,438 పెండింగ్‌లో ఉన్నాయి. మరో 10,752 కార్డులు పరిశీలనలో ఉ న్నాయి. వీటిని సమగ్రంగా పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేయబోతున్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు..

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కూడా ఈసారి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయబోతోంది. జనవరి 26 నుంచి అమలు చేయబోతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే ద్వారా జరగనుంది. పట్టణాల్లో ఏడాదికి రూ.2లక్షలు, గ్రామాల్లో లక్షన్నరలోపు ఆదాయం ఉండి ఇల్లు లేని పేదలు, ఖాళీ స్థలం ఉండి నిర్మించుకునేందుకు ముందుకొచ్చిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నారు. తొలివిడతలో అతి నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు, ఇతరులకు రూ.5లక్షలు ఈ పథకం కింద నిధులు కేటాయిస్తారు. ఖమ్మం జిల్లాలో 3,57,869 దరఖాస్తులు వచ్చాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,73,493 దరఖాస్తులు రాగా 93శాతం సర్వే పూర్తి చేశారు. కాగా గురువారం నుంచి జరిగే సర్వేలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ జరుగనుంది.

కమిటీల భాగస్వామ్యం, అధికారులకు పరీక్షే

ప్రభుత్వం అమలు చేయబోతున్న రైతుభరోసా ఇందిరమ్మ ఆత్మీయభరోసా రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఇందిరమ్మ కమిటీలను భాగస్వామ్యం చేశారు. గ్రామ సభల నిర్వహణలో ఇందిరమ్మ కమిటీలు కీలకపాత్ర పోషించబోతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో లబ్ధిదారుల జాబితా రూపకల్పన అధికారులకు కత్తిమీద సాముకానుంది. 'కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం' అన్నట్లుగా అనర్హులను లబ్ధిదారుల జాబితాలో చేరిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఇప్పటికే మంత్రులు హెచ్చరించారు. మరోవైపు గ్రామస్థాయిలో లబ్ధిదారుల జాబితా రూపకల్పనలో ఇందిరమ్మ కమిటీల నుంచి వత్తిళ్లు వచ్చే అవకాశం ఉంది.

వ్యవసాయ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

సుమారుగా రూ. 14 లక్షలు వరకు నష్టం వాటిల్లినట్టు సమాచారం. మార్కెట్ యార్డులకు గత ఆరు రోజులుగా సంక్రాంతి సెలవులు ఉన్నప్పటికీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడం గమనార్హం. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని పలువురు వ్యాపారులు అనుమానం వ్యక్తం చేస్తుండగా పలువురు మాత్రం ఆకతాయిల పనే అని అంటున్నారు. మార్కెట్ యార్డులో సెక్యూరిటీ వ్యవస్థ సరిగ్గా లేనందున కొంతమంది ఆకతాయిలు నిత్యం గంజాయి, మద్యం, సిగరెట్లు తాగడానికి ఇక్కడికి వస్తుంటారని, వారే ఈ ఘటనకు కారణమని కొంతమంది వ్యాపారులు పేర్కొంటున్నారు. మార్కెట్‌కు కేటాయించిన ఫైరింజన్ ఇక్కడ కాకుండా మరో ప్రాంతానికి పంపించడంతో మార్కెట్‌లో పంటలకు రక్షణ లేకుండా పోయిందని పలువురు వ్యాపారులు వాపోతున్నారు. అగ్ని ప్రమాదంలో పత్తి పూర్తిగా కాలిపోయిన తరువాత రెండు ఫైరింజన్‌లు వచ్చి మంటలను ఆర్పేశాయి. ప్రమాదం జరిగిన అనంతరం ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మార్కెట్ కమిటీ నూతన కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన యరగర్ల హనుమంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్ సందర్శించారు. మార్కెట్‌కు ఫైరింజన్ ఆవశ్యకతపై గతంలో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వరుస కథనాలు ప్రచురించినా అధికారులు స్పందించలేదు. కాగా, అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటనపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. జిల్లా అధికార యంత్రాంగం అక్కడికి చేరుకోవాలని ఆదేశించారు. సంఘటనపై నివేదిక ఇవ్వాలని కోరారు.

ఎన్టీఆర్ వ్యక్తి కాదు.. సామూహిక శక్తి

జూలూరుపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు జవజీవాలను నింపి ప్రాణ ప్రతిష్ట చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనని, తెలుగువారి ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ ఒక ప్రతీక అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలోని కాకర్ల గ్రామంలో బుధవారం దివంగత నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నర్సిరెడ్డితో పాటు టీడీపీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి జూలూరుపాడులో టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి జూలూరుపాడులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీగా కాకర్లకు తరలివెళ్లారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌తో కలిసి ఎన్టీఆర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. పార్టీ పతాకాన్ని నర్సింహులు ఎగురవేశారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకుడు తాళ్లూరి అప్పారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో నర్సిరెడ్డి మాట్లాడుతూ తెలుగుజాతి ఉన్నంత వరకు, తెలుగు వారు జీవించినంత వరకు ఎన్టీఆర్ చిరస్మరణీయుడని పేర్కొన్నారు. నటుడిగా ఆయన పోషించని పాత్ర లేదని, వెండితెర ఇలవేల్పుగా, జానపద, చారిత్రక, పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో మకుటం లేని మహారాజుల వెలుగొందారని కొనియాడారు. పేదవాడి ఆకలి తీర్చడానికి, బడుగు, బలహీనవర్గాల ప్రియబాంధవుడిగా మారి అన్నదాతల్లో వెలుగులు నింపిన మహానుభావుడు ఎన్టీఆర్ అని శ్లాఘించారు. తెలంగాణలో టీడీపీ జెండా ఎగురవేయడానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు.

టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సమావేశాలు, ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని పార్టీని బలోపేతం చేయాలని కోరారు. రాజకీయాల్లో స్థిమితం, స్థిరత్వం ఉండాలని, క్రమశిక్షణగా మెలగాలని ఉద్బోధించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ తన గెలుపునకు కృషి చేసిన టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానని తెలిపారు.


సభలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ సభ్యుడు నర్సిరెడ్డి

ఈ కార్యక్రమంలో టీడీపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం, ఉపాధ్యక్షుడు కూరపాటి వెంకటేశ్వర్లు, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకూరి చలపతి, జిల్లా నాయకులు మందడపు సుధాకర్, కేతినేని హరీష్, కత్రం స్వామి, తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు, ఆరెం రామయ్య, ఆరెం వరలక్ష్మి, వడ్డె వెంకటనారాయణ, రోకటి రంగారావు, గోవిందు, నర్సింహారావు, చావా వెంకటేశ్వర్లు, కృష్ణారావు, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్‌నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, యల్లంకి సత్యనారాయణ, పీజీ కృష్ణమూర్తి, గుండెపిన్ని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమప్రదాత ఎన్టీఆర్

» టీడీపీ నాయకులు బక్కని నర్సింహులు, టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి



ముదిగొండలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు, వైరాలో నివాళులర్పిస్తున్న దృశ్యం

ముదిగొండ/వైరా జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమప్రదాత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముదిగొండ మండలం అమ్మపేటలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ బలహీనపడలేదని, కార్యకర్తలు ఇంకా ఉన్నారని, కొంతమంది స్వార్థపరులు మాత్రమే పార్టీని వీడారని తెలిపారు. పేదలు, బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు పెట్టిన సంక్షేమప్రదాత ఎన్టీఆర్ అని కొనియాడారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం మడమతిప్పని యోధుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. పేదల కోసం ఎన్టీఆర్ నిరంతరం పరితపించారని, ఎన్టీఆర్ ఖ్యాతి అజరామరం అని తెలిపారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కోరారు. యువకులు టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. తొలుత గ్రామంలోని వెలగొండ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం లో టీడీపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కూరపాటి వెంకటేశ్వర్లు, నాయకులు కరుణాకర్, హరీష్, వీరబాబు, రాజేశ్వరి, శ్రీను, నర్సింహాచారి, రామారావు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటాలి

వైరా(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సత్తా చాటాలని టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కా నర్సింహులు పిలుపునిచ్చారు. బుధవారం వైరాలోని ఎన్టీఆర్ భవన్ అయిన టీడీపీ కార్యాలయంలో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథంతో కలిసి పాల్గొన్నారు. ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాష్ట్రంలో టీడీపీ బలపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీ సభ్యత్వ నమోదులో అన్నివర్గాల ప్రజల నుంచి మంచి ఆదరణ లభించిందని తెలిపారు. వైరా నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. జిల్లా మాజీ అధ్యక్షుడు కూరపాటి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు, నాయకులు కిలారు సురేందర్, ప్రదీప్, మందడపు మధుసూదన్‌రావు, పుల్లారావు, అయ్యప్పచౌదరి, చావా ఉషారాణి పాల్గొన్నారు.

'సంక్షేమ' సర్వే పారదర్శకంగా చేపట్టాలి

» అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలి
» అధికారులతో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సమీక్ష
» 19లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశం



సమీక్ష నిర్వహిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 26 నుంచి అమలుచేయనున్న నాలుగు సంక్షేమ పథకాల క్షేత్రస్థాయి సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు కొత్త పథకాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి సమీక్షించారు.

ఆయన మాట్లాడుతూ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల మంజూరీ, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం విధి విధానాలు జారీచేసిందన్నారు. పథకాల అమలుపై అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని, దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు పథకాల లబ్ధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

రైతు భరోసా కింద ప్రభుత్వం వ్యవసాయ సాగు యోగ్యమైన భూములకు ఎకరాకు సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వనుందని కలెక్టర్ తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించాలన్నారు. ఆర్ఐ, ఏఈవోలు క్షేత్ర తనిఖీలు చేసి, సాగు యోగ్యం, వ్యవసాయ యోగ్యం కాని భూముల గుర్తింపు చేయాలన్నారు. గురువారం నుంచి సర్వే ప్రారంభించి, ఈ నెల 19 లోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 20 నుంచి గ్రామ సభల నిర్వహనకు కార్యాచరణ చేయాలన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారులు రీ వెరిఫై చేయాలని కలెక్టర్ తెలిపారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించి సంవత్సరానికి రూ.12 వేలు, రెండు విడతలుగా లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఉపాధిహామీ జాబ్ కార్డు ఉండి, భూమిలేక, గత సంవత్సరం కనీసం 20 రోజులు ఉపాధిహామీ పనులు చేసిన వారికి ఆత్మీయ భరోసా పథకానికి అర్హులన్నారు. లబ్ధిదారులకు జాబ్‌కార్డ్‌లో భూమి వుండకూడదన్నారు. సర్వే ఈ నెల 18లోగా పూర్తిచేసి, 20న చేపట్టే గ్రామ సభల్లో ప్రజల ముందు ఉంచాలన్నారు.

కొత్తరేషన్ కార్డుల జారీకి మండల స్థాయిలో ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్‌లు, జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి ధృవీకరణ బాధ్యత ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి జారీచేసిన ఫార్మాట్‌లో సర్వే నివేదిక సమర్పించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే జిల్లా వ్యాప్తంగా ముగింపు దశకు చేరిందన్నారు. సర్వే సమయంలో ఒక గ్రామం, ప్రాంతంలో ఉన్నా, లబ్ధిదారునికి భూమి ఏ గ్రామం, ప్రాంతంలో ఉంటే, ఆయా గ్రామ/ప్రాంతాల్లో మంజూరులు ఇవ్వాలన్నారు. మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని, జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో డీఆర్డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, డీఎస్వో చందన్ కుమార్, డీఏవో పుల్లయ్య, హౌజింగ్ పీడీ బి. శ్రీనివాస్, అదనపు డీఆర్డీవో నూరుద్దీన్, డీఎల్పీవో రాంబాబు పాల్గొన్నారు.

2న 'కథానిలయం' వార్షికోత్సవం

● హాజరుకానున్న సాహితీవేత్తలు

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని వేదిక ఫంక్షన్ హాల్‌లో ఫిబ్రవరి 2న ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం వరకు కథా నిలయం వార్షికోత్సవం జరుగనుంది. 'కారా' మాష్టారుగా ప్రముఖుడైన ప్రముఖ కథా రచయత కాళీపట్నం రామారావు స్ఫూర్తితో నిర్వహిస్తున్న కథానిలయం వార్షికోత్సవాలను ఉభయ రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో నిర్వహిస్తుంటారు. దానిలో భాగంగా ఈ ఏడాది ఖమ్మంలో 'ఈస్థటిక్స్ స్పేస్ సాహిత్య సంస్థ' ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఖమ్మంలో ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ప్యానల్ డిస్కషన్, కథానిలయం వార్షిక నివేదిక, సభికుల అభిభాషణతో పాటు పుస్తకాల ఆవిష్కరణలు ఉంటాయి. భిన్నకథకులు, విభిన్న రీతులు, నాలుగు తెలుగు ప్రాంతాల్లోని స్త్రీల కథలలో పోలికలు తేడాలు, ప్రభావితం చేసిన తెలుగు కథకులు, తెలంగాణ కథ సమాజకేంద్రకం, వ్యక్తి కేంద్రకం అనే అంశాలపై వక్తల ప్రసంగాలు ఉంటాయి. ఘంటా చక్రపాణి, పెద్దింటి అశోక్ కుమార్, సంగిశెట్టి శ్రీనివాస్, సీతారాం, కెసీ అశోక్ కుమార్, దేవకి దేవి, ప్రసేన్, రవిమారుత్, దాసరి అమరేంద్ర, వివిన మూర్తి, వినోదిని, వంశీకృష్ణ, మళ్లపూడి సుబ్బారావు, కాళీపట్నపు సుబ్బారావు తదితర సాహితీవేత్తలు పాల్గొంటారు.

సంక్రాంతి సంబరాల్లో ఇన్‌కం టాక్స్ చీఫ్ కమిషనర్



ముంబై ఇన్‌కంట్యాక్స్ చీఫ్ కమిషనర్‌ను సత్కరిస్తున్న గ్రామస్థులు

అశ్వారావుపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేడుకల్లో పాల్గొనడానికి ముంబాయి ఇన్‌కంటాక్స్ చీఫ్ కమిషనర్, మహబూబ్‌నగర్‌కు చెందిన పీర్యానాయక్ వచ్చారు. అశ్వారావుపేట మండలంలోని వినాయయపురం గ్రామంలో ఉన్న బంధువు భూక్య కృష్ణ ఇంట జరిగే సంక్రాంతి పండగ సందర్భంగా వేడుకలలో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. మంగళవా రం సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగిన పలు కార్యక్రమాలలో పాల్గొని పీర్యానాయక్ సందడి చేశారు. ఆయన మాట్లాడుతూ సంప్రదాయంగా నిర్వహించే సంక్రాంతి పండుగ వేడుకలలో గ్రామస్థులతో కలిసి పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. చీఫ్ కమిషనర్‌ను వినాయకుపురం గ్రామానికి చెందిన పలువురు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో బీరం వెంకటేశ్వరరావు, ఉప్పల మురళీ, ప్రసాదు, లోకం సాంబశివరావు, రొయ్యల సత్యనారాయణ, బాణోతు శ్రీనివాసరావు, బుడగం రవీంద్ర, ఉప్పల సుదర్శనరావు, తాతారావు, జక్కుల నాగేశ్వరరావు, విక్రమ్‌రెడ్డి, లకావత్ వెంకటేశ్వరరావు, బేతం రాము పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా జూనియర్ ఆర్చరీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో జూనియర్స్ విభాగంలో బాలుర, బాలికల ఆర్చరీ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి పుట్టా శంకరయ్య తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జనన ధృవీకరణ పత్రంతో ఉదయం 9 గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి నిశ్చయ తాంబూల మహోత్సవం



నిశ్చయ తాంబూల మహోత్సవ దృశ్యం

కరకగూడెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమత్‌భట్టుపల్లి పంచాయతీ బుర్ధారం అడవిలో కొలువు తీరిన సువర్ణగిరి జ్వాలా లక్ష్మీ నరసింహస్వామికి ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో నిశ్చయ తాంబూల మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. మకర సంక్రాంతి సందర్భంగా జ్వాలా లక్ష్మీనరసింహ స్వామి అలంకరణ భూషుడై భక్తులకు దర్శనమించాడు. సాయంత్రం కుర్నవల్లి, భట్టుపల్లి, కరకగూడెం, బుర్ధారం గ్రామాలలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి 9-30 గంటల సమయంలో సువర్ణగిరి జ్వాలా లక్ష్మీనరసింహ స్వామికి, ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లకు కల్యాణ నిశ్చయా తాంబూల మహోత్సవాన్ని ఆలయ పూజారి నిర్వహించారు.

మైసూరు దత్త పీఠాధిపతిని కలిసిన మంత్రి తుమ్మల



స్వామిజీ ఆశీర్వచనాలు అందుకుంటున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మైసూరు దత్త పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసి ఆశీర్వచనాలు అందుకున్నారు. బుధవారం ఆంధ్రాలోని ఏలూరులోని ఆశ్రమానికి విచ్చేసిన సందర్భంగా మంత్రి తుమ్మల స్వామిని కలుసుకుని ఘనంగా సన్మానించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో తులతూగాలని స్వామిజీ ఆకాంక్షించారు.

క్రైం సమాచారం

ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీ: వ్యక్తి మృతి

చుంచుపల్లి, జనవరి15(ఆంధ్రజ్యోతి): రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం మైలవరం గ్రామానికి చెందిన పెండెం నర్సయ్య(44) మైలవరం నుంచి కొత్తగూడెం ప్రాంతానికి వ్యాపార నిమిత్తం రాకపోకలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగూడేనికి పని నిమిత్తం వచ్చి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ఆటో ఎదురుగా వచ్చి ఢీకొంది. దీంతో నర్సయ్య ఆటో పల్టీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొత్తగూడెం టూ టౌన్ ఎస్ఐ షిహినా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, బాబు, పాప ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు...



రాజు (ఫైల్)

పెనుబల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని రంగారావుబంజర్ గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగింది. మండలంలోని పార్థసారధిపురం గ్రామానికి చెందిన కేసరి రాజు(35), అదే గ్రామానికి చెందిన కుంజా మహేష్‌తో కలిసి వీఎంబంజర్‌కు వస్తుండగా పెనుబల్లి నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొనడంతో రాజు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మహేష్‌కు తీవ్రగాయాలు కాగా అతడిని పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఢీకొట్టిన కారు సంఘటనాస్థలంలో ఆగకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ వద్ద కారును నిలిపివేసి డ్రైవర్ పరారయ్యాడు. బుధవారం కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ....



ఎర్రుపాలెం జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల ఎర్రుపాలెం-కంచికచర్ల రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. ఎర్రుపాలెం ఎస్ఐ పి.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రుపాలెం గురుకుల పాఠశాల దగ్గరలో గల రహ దారి వద్దగల ఓ చెట్టుకు ఆనుకొని గుర్తు తెలియని వ్యక్తి (40) పక్కన గల చెట్టుకి ఆనుకొని మద్యం మత్తులో పడిపోయాడు. 100 డయల్‌కి సమాచారం రావడంతో సదరు వ్యక్తిని ఎర్రుపాలెం బ్లూకోల్ట్ కానిస్టేబుల్ కె.ప్రకాశరావు చికిత్స నిమిత్తం 108 వాహనంలో మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీలో భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు కలిగి నలుపు రంగు టీషర్ట్ ధరించి, లేత నీలిరంగు జీన్స్‌ప్యాంటు ధరించి ఉన్నాడని, వివరాలు తెలిసిన వారు క్రింది నంబర్లలో 8712659164, 8712659165 పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైలు నుంచి జారి పడి వృద్ధుడు..



మధిర, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలోని అండర్ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. రైల్వే పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో కిలోమీటర్ నెం.527/28-30 సమీపంలో డౌన్‌లైన్ పై వెళ్తున్న గుర్తు తెలియని రైలు నుంచి గుర్తు తెలియని ప్రయాణికుడైన వృద్ధ దివ్యాంగుడు (60) జారిపడి మృతి చెందాడు. అటువెళ్లిన స్థానికులు గుర్తించి అందించిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మధిర ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. రైల్వే ఎస్ఐ ఆధ్వర్యంలో మధిర ఇన్‌చార్జి జీ వేణుగోపాలరెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మిర్చి'ని వెంటాడుతున్న తెగుళ్లు

» ఈ ఏడాది సగానికి సగం తగ్గిన మిర్చిసాగు విస్తీర్ణం
» మార్కెట్లో పతనమైన మిర్చి ధర
» ఆందోళనలో రైతులు



తనికెళ్లలో మిర్చీని ఆరబోస్తున్న రైతు

కొణిజర్ల, జనవరి15(ఆంధ్రజ్యోతి): మిర్చిసాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుతుంది. నల్లతామరపురుగు బెడద, వైరస్, తెగుళ్లు, మార్కెట్‌లో ధరలు పతనం వీటి కారణాలతో విసుగెత్తిన మిర్చి రైతులు సాగుకు స్వస్తి చెబుతున్నారు. కొణిజర్ల మండలంలో గత ఏడాది 3,200 ఎకరాలలో మిర్చిని సాగు చేస్తే, ఈ ఏడాది 1,800 ఎకరాలలో మాత్రమే సాగు చేశారు. ఈ ఏడాది సాగు చేసిన రైతుల్లో కూడా నిరాశ ఎదురవుతుంది. గతంలో ఇదే సమయంలో క్వింటా మిర్చి ధర రూ.22,000 నుంచి రూ. 23,000 ఉంటే, ప్రస్తుతం ధర క్వింటా రూ. 15,000 లు మాత్రమే ఉంది. దీంతో ఈసారి కూడా పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని నిరాశ చెందుతున్నారు. మార్కెట్‌లో ధర పూర్తిగా తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిర్చిసాగు తగ్గింది. ఏవో బాలాజీ

మండలంలో గత ఏడాది కంటే ఈ ఏడాది మిర్చిసాగు తగ్గింది. గత సంవత్సరం 3,200 ఎకరాల్లో సాగు చేస్తే, ఈ ఏడాది 1,800 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. రైతులను ప్రధానంగా నల్లతామర, వైరస్, తెగుళ్ల వెంటాడుతున్నాయి. పెట్టుబడులు పెట్టలేక రైతులు సాగుకు మొగ్గుచూపడంలేదు. రైతులకు పంట సాగు చేసేందుకు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం.

పెరిగిన పెట్టుబడులు-తగ్గిన దిగుబడి

రైతులు సాధారణంగా ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల పంటను పండిస్తామంటున్నారు. ఈ ఏడాది మాత్రం ఎకరాకు 10 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. పెట్టుబడులు విపరీతంగా అవుతున్నాయని, ఎకరానికి రూ.లక్షకు పైగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందటున్నారు. కాగా మార్కెట్‌లో ధరలు తమ కష్టంపై నీళ్లు చల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సాగును తగ్గిస్తున్న రైతులు..

మిర్చికి పెట్టుబడులు పెట్టలేక రైతులు మిర్చి సాగును తగ్గిస్తున్నారు. ఏడాదికి ఏడాది సాగు పెరగాల్సి ఉండగా మండలంలో మాత్రం తగ్గుతుంది. తెగుళ్లు, మార్కెట్‌లో ధరలు లేకపోవడమే అని రైతులు చెబుతున్నారు. పది ఎకరాలు వేసే రైతు కూడా ఈ ఏడాది మూడు నుంచి ఐదు ఎకరాలు మాత్రమే మిర్చిని సాగు చేశారు. మిర్చికి నల్లతామరపురుగు వచ్చిందంటే పంటను వదులకోవాలిసిందేనని రైతులు పేర్కొంటున్నారు. ఆ పురుగు పూత దశలోనే వస్తుందని ఇక కాపుపడనీయదని అంటున్నారు. దానిని నివారించడం కష్టమని అధికారులు కూడా తెలుపుతున్నారు.

పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు



● తుప్పతి శ్రీను, తనికెళ్ల

రెండు ఎకరాలలో మిర్చి వేశా. మొదటకాపు కోస్తున్నా. మార్కెట్‌లో ధరలు చూస్తే క్వింటా రూ. 15వేలు లోపే అంటున్నారు. నిత్యం చేలల్లో ఉండి కష్టపడి పంటను పండిస్తే ధరల కూడా లేకుండా ఉంది. ఎకరానికి పెట్టుబడి రూ.లక్షన్నర వరకు పెట్టా. పెట్టుబడులు కూడా వస్తాయోరావోనని భయం వేస్తుంది. మిర్చిసాగు చేయాలంటేనే భయం వేస్తుంది.

ధరలు నిరాశపరుస్తున్నాయి..



● కొత్తా వెంకటేశ్వరరావు, దిద్దుపుడి

పంటను పండించి మార్కెట్‌లోకి తీసుకెళ్లితే ధర చూసి భయం వేస్తుంది. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి పంటను తక్కువ ధరలకు అమ్మాలంటే ఏమి చేయాలో అర్థంకాక తల పట్టుకుంటున్నాం. గత ఏడాది ఐదున్నర ఎకరాలు వేస్తే ఈ సారి నాలుగు ఎకరాలు సాగు చేశా. గత ఏడాదే ఏసీలో ఉంచిన మిర్చి అలాగే ఉంది. ఇప్పుడు క్వింటా రూ.15 వేలు అంటున్నారు. రైతు కష్టాన్ని ఎవరూ గుర్తించడంలేదు.

మహిళ ఆత్మహత్య

ఖమ్మం రూరల్ జనవరి15(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసునమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరంలోని దానవాయిగూడేనికి చెందిన ఓర్సు లక్ష్మి(33) సుజాతనగర్ మండలం నాయకులగూడేనికి చెందిన ఓర్సు నరసింహారావుకి 18 ఏళ్లక్రితం వివాహం జరిగింది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఐదేళ్ల క్రితం భార్య భర్తలిద్దరు కుటుంబ సమస్యల పై ఘర్షణపడి వేర్వేరుగా ఉంటున్నారు. లక్ష్మి దానవాయిగూడెంలో ఒంటరిగా ఉంటుంది. ఈ నెల 9న లక్ష్మి దానవాయిగూడెంలోని తన ఇంట్లోనుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఈ నెల 14న ఉదయం వెంకటగిరి క్రాస్‌రోడ్డులో ఉరేసుకొని చనిపోయి కనిపించింది. తమ చెల్లెలి మృతికి వెంకటగిరికి చెందిన బొడ్డు వెంకటేశ్ అనే వ్యక్తిపై తమకు అనుమానం ఉందంటూ మృతురాలి సోదరి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

బొడ్రాయిని ఢీకొట్టిన కారు

అశ్వారావుపేట రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వినాయకపురంలో నారాయణపురం రోడ్డులో వాటర్ ట్యాంకు పక్కన గల బొడ్రాయిని మంగళవారం రాత్రి కారు ఢీకొంది. దెబ్బతిన్న గ్రిల్స్‌ను ఏర్పాటు చేయిస్తానని కారు డ్రైవర్ హామీ ఇవ్వడంతో అక్కడ నుంచి పంపించి వేశారు.



ఆకట్టుకుంటున్న పెయింటింగ్స్..

నగర సుందరీకరణలో ఖమ్మం నగరంలో వీధి గోడలు అందమైన వాల్ పెయింటింగ్స్‌గా మారుతున్నాయి.. వాల్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల గోడలపై అందమైన చిత్రాలుగా మారుస్తున్నారు. ప్రకృతి దృశ్యాలు, పల్లె వాతావరణాలు ప్రతిబింబించే విధంగా గోడలను తీర్చిదిద్దుతున్నారు.

●ఆంధ్రజ్యోతి, ఫొటో గ్రాఫర్



20న ఏఏఐ బృందం రాక

» కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై సర్వే

కొత్తగూడెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఈ నెల 20వ తేదీన ఎయిర్‌పోర్టు అథారిటి ఆఫ్ ఇండియా (ఏఏఐ) బృందం రానుంది. కొత్తగూడెంలోని గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై ఈ బృందం సర్వే చేయనుంది. కొత్తగూడెం పట్టణంలోని రామవరం గరీబ్‌పేట ప్రాంతంలో 950 ఎకరాల స్థలాన్ని ఇప్పటికే అధికారులు సేకరించారు. ఆ స్థలంలో ఏఏఐ బృందం సర్వే చేపట్టి ఇక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలనచేయనున్నారు.

రాష్ట్రంలో కొత్తగా ఎయిర్‌పోర్టుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వేర్వేరుగా కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి లేఖల ద్వారా విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా కేంద్ర మంత్రిని కలిసి కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందచేసి స్వయంగా విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన కేంద్ర పౌరవిమానశానశాఖ మంత్రి తప్పని సరిగా కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చులను భరిస్తే ఏఏఐసీ బృం దాన్ని పరిశీలనకు పంపిస్తామని కూడా ఆదేశించారు. దీంతో స్పందించిన మంత్రి తుమ్మల వెంటనే ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రి ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి స్వయంగా లేఖ రాశారు. దీంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు స్థలసేకరణకు ఏఏఐ బృందానికి ఖర్చుల నిమిత్తం రూ.38లక్షలు నిధులు కూడా మంజూరు చేసింది. ఎయిర్‌పోర్టు అథారిటీ బృందం ఈ నెల 20వ తేదీన వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు రామవరం గరీబ్‌పేట ప్రాంతంలో 950 ఎకరాల స్థలాన్ని సిద్ధం చేశారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనువైన ప్రాంతంగా ఉంటుందా.. లేదా దానికి కావాల్సిన సాంకేతికపరమైన అంశాలను అధ్యాయనం బృందం తేల్చి నివేదికను తయారు చేసి కేంద్ర పౌరవిమానయానశాఖకు నివేదించనున్నారు.

విశ్రాంత కార్మికులకు తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలి

రుద్రంపూర్, (సింగరేణి) జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో రేషన్‌కార్డులు జారీ చేస్తామని ప్రకటించడం జరిగిందని, అదేవిధంగా సింగరేణి సంస్థలో పని చేసిన సింగరేణి విశ్రాంతి కార్మికులకు కూడ రేషన్‌కార్డులు షరతులు లేకుండ రేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కులగణనలో నమోదు చేసిన ఆధారాల ప్రకారం దర ఖాస్తు చేస్తున్న వారి అందరికి రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, ఎలాంటి నిబంధనలు లేకుండా సింగరేణిలో పని చేసి రిటైర్డ్ అయిన వారికి కూడా ఎలాంటి షరతులు పెట్టకుండా ఇవ్వాలని తెలిపారు. రేషన్‌కార్డులు ఉన్న వారికి వారి పిల్లల పేర్లను కూడా నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

రంగవల్లులు, బొమ్మల కొలువుతో సందడి

గాలిపటాలతో చిందేసిన యువత

తెలుగింట పెద్ద పండుగగా పిలచుకునే సంక్రాంతి వేడుకలు జిల్లాలో అత్యంత వైభవోపేతంగా జరిగాయి. సంక్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాలలో ఉండే కొత్త అల్లుళ్లు రావడం, వివిధ ప్రాంతాలలో ఉద్యోగాలు చేసేవారు స్వగ్రామాలకు రావడంతో గ్రామాలు సందడిగా మారాయి. సంక్రాంతి రోజున మహిళలు పోటాపోటీగా వాకిళ్లను రంగురంగుల ముగ్గులతో నింపేసారు. పంతంగులతో యువత సందడి చేశారు. కోడి పందేలు జోరుగా సాగాయి.


సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యేలు కనకయ్య, జారే


రామవరంలో ముగ్గు వేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్


'గూడెం'లో ముగ్గులు వేస్తున్న మహిళలు


అశ్వారావుపేటలో రంగవల్లులు


పాల్వంచలో ముగ్గు వేస్తున్న బాలిక


గాలి పటాలు ఎగురవేస్తున్న యవకులు


బహుమతి అందజేస్తున్న చైర్‌పర్సన్ సీతాలక్ష్మి


ఇల్లెందులో ముగ్గు వేస్తున్న మహిళలు

25 ఏళ్ల భవనం.. కూలేందుకు సిద్ధం

- శిథిలావస్థకు చేరిన వినాయకపురం పశు వైద్యశాల
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది


శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల ఇదే..

అశ్వారావుపేట రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వినాయకపురంలో గల మండల పశువైద్యశాల శిథిలదశకు చేరుకుని ఎప్పుడు కూలిపోతుందో తెలియకుండా ఉంది. పెచ్చులు పెచ్చులుగా ఊడుతున్న స్లాబు, నెర్రలు ఇచ్చిన గోడలు, వర్షం వస్తే మందులు, ఇతర సామగ్రి పూర్తిగా తడిసిపోతుండటంతో వైద్యులు, సిబ్బంది ఆసుపత్రి లోపల ఉండాలంటేనే భయపడుతున్నారు. వినాయకపురంలో గ్రామీణ ప్రాంత పశువులకు సేవలు అందించేందుకు 1999లో పశువైద్యశాలను నిర్మించారు. నిర్మించిన నాటి నుంచి నేటివరకు రూపాయి పెట్టి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ఆసుపత్రి పై భాగం మొత్తం పెచ్చులు పెచ్చులుగా ఊడిపోతుంది. ప్రతి గదిలోనూ ఇదే పరిస్థితి. వర్షాకాలంలో అయితే పరిస్థితి మారీ దారుణంగా ఉంటుంది. వర్షంనీరు లోపల చేరటంతో సామాగ్రి, మందులు అన్నీ బల్లలను ఏర్పాటు చేసుకుని వాటి మీద పెట్టుకుని రక్షించుకోవాల్సి వస్తోంది. గోడలు కూడా నెర్రలు ఇచ్చి పూర్తిగా పాడైపోయాయి. గోడలు, స్లాబు దెబ్బతినటంతో భవనం ఎపుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఆసుపత్రిలో సిబ్బంది అంతా భయపడుతూనే విధులు నిర్వహిస్తున్నారు. భవనానికి కనీస మరమ్మతులు చేయాలని పలుమార్లు కోరినా ఇప్పటివరకు పైసా వెచ్చించి మరమ్మతులు చేయలేదు. శిధిలదశకు చేరుకున్న ఆసుపత్రి స్థానంలో కొత్తగా ఆసుపత్రిని నిర్మించాలని ప్రజలు, పశు యజమానులు, సిబ్బంది కోరుతున్నారు.


పెచ్చులూడిన గోడలు

డయాలసిస్ యూనిట్లను అందుబాటులోకి తేవాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సర్వజన ఆసుపత్రి తనిఖీ


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి (జీజీజీహెచ్)కు అదనంగా కేటాయించిన డయాలసిస్ యూనిట్లను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కొత్తగూడెం జీజీహెచ్‌లోని ప్రతి వార్డును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఔట్ పేషెంట్ వార్డులో ఎక్స్‌రే యంత్రం పని చేయకపోవటానికి గమనించి దీనిని ఎందుకు వాడటం లేదని సిబ్బందిని ప్రశ్నించారు. అది పాడైందని సిబ్బంది చెప్పగా కొత్త ఎక్స్‌రే యంత్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో ఎంతమంది డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో చేపడుతున్న డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించి వారం రోజులలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ పనులను త్వరితగతిని పూర్తి చేసి డయాలసిస్ యూనిట్లు ప్రజల అవసరానికి ఉపయోగపడేలా త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా క్యాజువాలిటీ వార్డును మరొక చోటికి మార్చాలని అధికారులను ఆదేశించారు. సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి అణువణువూ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. ఈ పరిశీలనలో ఆసుపత్రి సిబ్బంది ఆర్అండ్‌బీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ప్రతిభ వెలకట్టలేనిది: పొదెం

కొత్తగూడెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మహిళల ప్రతిభ వెలకట్టలేనిదని రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్, డీసీసీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, టీపీసీ సభ్యుడు జేబీ శౌరీ, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్‌లు కొనియాడారు. బుధవారం కొత్తగూడెం పట్టణంలోని రామవరం ఎనిమిదవ వార్డులో యూత్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజశేఖర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడి విజేతలను బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు అబలలు కాదు. సబలలు కాదు అని వివిధ రంగాల్లో నిరూపించుకున్నారని గుర్తు చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ ముగ్గుల పోటీల్లో ప్రతి ఒక్క మహిళకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విజేతలుగా నిలిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయతోపాటు మూడు కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. అనంతరం పాల్గొని ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతులను నిర్వాహకులు అందజేశారు. మొత్తం ఈ పోటీల్లో 77 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ ముగ్గుల పోటీలకు విజేతలుగా భద్రాది జిల్లా సఖీ సెంటర్ కో-ఆర్డినేటర్ శుభశ్రీ, పంచాయతీరాజ్ శాఖ సీనియర్ అసిస్టెంట్ అంబికా, కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల కంప్యూటర్స్ విభాగం అధ్యాపకురాలు విశాలిని, గౌతంపూర్ వాసి మాధవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మారపాక రమేష్, ఎల్లంకి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు మోత్కూరి ధర్మారావు, ఎం.ఏ రజాక్, కాసుల వెంకట్, అల్లాడి నరసింహారావు, మహ్మద్ గౌస్ , గడ్డం రామచందర్, రైల్వే సెంట్రల్ కమిటీ బోర్డు సభ్యులు వై.శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు పల్లపు లక్ష్మణ్, సురేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న పొదెం వీరయ్య

మాంజా దారంతో ముగ్గురికి గాయాలు





చుంచుపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం, చుంచుపల్లి ప్రాంతాల్లో మాంజా దారానికి ముగ్గురికి గాయాలు అయిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. కొత్తగూడెం బస్టాండ్ సెంటర్లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడికి రోడ్డుపై పడి మాంజా కాలికి చిక్కుకు పోయింది. దీంతో రెండు ఇంచుల వరకు కోసుకుపోయింది. స్థానికులు గమనించి ఆ యువకుడిని కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ కాలనీ బైపాస్ రోడ్డు వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ దంపతులకు మాంజా దారం తగిలింది. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తికి గొంతు వద్ద ఆ మాంజా తగలడంతో అప్రమత్తమై ఆ వాహనాన్ని ఆపివేశాడు. వెనుకనే ఉన్న మహిళకు చేతికి మాంజా గాయాలయ్యాయి.

వైభవంగా పర్ణశాల రామయ్య కల్యాణం



దుమ్ముగూడెం జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్ణశాల రామాలయంలో మంగళవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. తిరుమంజనం, నూతన వస్త్రాలంకరణ, ఆలయ ప్రదక్షిణ, విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యజ్ఞోపవీత యోత్రధారణ, స్వామి వారి అమ్మవారి ప్రవర్లు, మంగళాష్టకాలు, మహాసంకల్పం, మాంగల్యపూజ, మాంగల్యధారణ, మంత్రపుష్పకార్యక్రమాలను శాస్త్రోపేక్తంగా జరిపించారు. ఆలయ పర్యవేక్షకులు సాయిబాబా, ఇంచార్జి అనీల్‌కుమార్, అర్చకులు కిరణ్‌కుమారాచార్యులు, భార్గవా చార్యులు, వెంకటాచార్యులు, నరసింహాచార్యులు సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికను విజయవంతం చేయాలి

- మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యం
- ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన నాలుగు సంక్షేమ పథకాల అమలును ఈ నెల 26న ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా, మండల స్థాయి అధికారులందరు నిబద్దతతో పని చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. బుధవారం అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి కలెక్టర్ కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు ఇతర అధికారులతో ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26న అమలుచేయనున్న నాలుగు సంక్షేమ పథకాల విధి విధానాలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సభలను పక్కాగా నిర్వహించాలని, ఈ నెల 16 నుంచి 20 వరకు చేపట్టే క్షేత్రస్థాయి సర్వేలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని, 16 నుంచి 20 వరకు లబ్ధిదారుల ముసాయిదా జాబితా తయారీలో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభలు పక్కాగా జరిగే విధంగా ప్రణాళిక బద్దంగా చర్యలు తీసుకోవాలని, 21 నుంచి 25 వరకు డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండ చూడాలని, ఫ్లెక్సీలు, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని, అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో ప్రచురించాలని, గ్రామసభల్లో వచ్చే పిర్యాదులపై రిజిస్టర్లను, కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి ఆర్జీలను స్వీకరించాలని ఈ సర్వే గ్రామసభల పట్ల ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని, విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

కోడి పందేలను వీక్షించిన ఎమ్మెల్యే పాయం


పందెం కోడితో ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని తెలంగాణ సరిహద్దు ఏపీలో జరిగిన కోడి పందేలను చూడటానికి మంగళవారం పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు వెళ్లారు. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం ఏలేరు గ్రామంలో నిర్వహించిన కోడి పందేలను ఎమ్మెల్యే తన అనుచరులతో కలిసి వీక్షించారు. సంప్రదాయంగా జరిగే కోడి పందేలను ఎమ్మెల్యే వీక్షించడం ఇదే తొలిసారి అని పలువురు పేర్కొంటున్నారు. కాగా ఏలేరులో జరుగుతున్న కోడి పందేలు చూసేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. దీంతో బూర్గంపాడు శివారులో ఉన్న కిన్నెరసాని బ్రిడ్జి వద్ద భారీగా ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పోలీస్ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ

ములకలపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజలకు అందిస్తున్న సేవలపై క్యూ ఆర్‌కోడ్ ద్వార అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు ములకలపల్లి ఎస్‌హెచ్‌వో కిన్నెర రాజశేఖర్ తెలిపారు. బుధవారం క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు కనిపించి గుర్తించే ప్రదేశాల్లో పబ్లిక్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూ ఆర్ కోడ్‌ను ఏర్పాటుచేసినట్లు ప్రకటించారు. ఈ క్యూఆర్ కోడ్ ద్వార పోలీసుల సేవలను మరింతగా మెరుగుపర్చేందుకు ప్రజల సమస్యలు తెలిపేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ పుల్లారావు, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్‌రావు, ప్రకాష్‌రావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన రేగళ్ల శ్రీను

పాల్వంచ టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పాల్వంచకు చెందిన ప్రముఖ వ్యాపారి, బీఆర్ఎస్ పార్టీలో పని చేసిన రేగళ్ల శ్రీను బుధవారం టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కనగాల అనంతరాములు, కాపా కృష్ణమోహన్‌ల ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువాను కప్పి ఆనయను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీకి ప్రజల్లో ఆదరణ తగ్గలేదని, దానికి ఉదాహరణ ఇటీవల పార్టీకి ఆకర్షితులై పార్టీ సభ్యత్వాన్ని తీసుకుంటున్న వారి సంఖ్యను బట్టి రుజువవుతోందన్నారు. పార్టీకి రోజురోజుకూ ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సీతారాంబాబు, సాంబశివరావు, బెల్లంకొండ బాబూరావు, సుధాకర్, భద్రం, చంద్ర రవి, వీరమాచినేని నరేష్, తాతా భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల పరిశీలనపై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సీఈవో నాగలక్ష్మి

మణుగూరు జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు , ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పథకాలపై లబ్ధిదారుల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలన్న అంశంపై బుధవారం సన్నాహక సమావేశాన్ని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీ సీఈవో నాగలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్వే అనంతరం లబ్ధిదారుల వెరిఫి కేషన్ ఎలా చేయాలన్న అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ నెల 16 నుంచి 20 వతేది వరకు లబ్ధిదారుల వెరికేషన్ అనంతరం 20 నుంచి 24 వరకు గ్రామ సభల నిర్వహణ చేపడతామని మండల తహశీల్దార్ రాఘవ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు కంటే ఆటో చార్జీలే ప్రియం

స్టేషన్‌కు వెళ్లాలంటే అధిక భారం.. ప్రయాణికుల అవస్థలు

మణుగూరు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మణుగూరు రైల్వే స్టేషన్‌ను పట్టణానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో నిర్మించారు. అదీ అడవిలో కట్టారు. రైల్వే స్టేషన్ నిర్మించే క్రమంలో పట్టణ ప్రాంతంలో స్థలం లేక అలా చేయాల్సి వచ్చింది. ఇంత దూరాన రైల్వే స్టేషన్ నిర్మించినందు వల్ల అక్కడికి ప్రజలు చేరాలంటే చాలా వ్యయ ప్రయాసలకు గురి కావాల్సి వస్తోంది. రైల్వే స్టేషన్ నుంచి కొత్తగూడెంకు రైలు చార్జి రూ.45 ఉండగా మణుగూరు నుంచి రైల్వే స్టేషన్‌కు ఆటో చార్జి సర్వీసుచార్జి రూ.50, సింగిల్‌గా వెలితే రూ 200 ఉంది. కనుక మణుగూరు పట్టణ ప్రజలు రైలు మాట ఎత్తడం లేదు. రైల్వేస్టేషన్‌కు అతి సమీపంలోని పీవీ కాలనీ వాసులు కూడా మూడు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిందే. దీని వల్ల మణుగూరు సికింద్రాబాద్‌కు గల రైలు సౌకర్యం అంత ప్రయోజనాన్ని చేకూర్చ లేకపోతుంది. అతి తక్కువ మంది మాత్రమే దీనిని వినియోగించుకుంటున్నారు. జనం బస్సులు ఆటోలు టాటా మ్యాజిక్‌లలో కిక్కిరిసి వెళుతుంటారు. మణుగూరు నుంచి 100కు పైగా బస్సు సర్వీసులు కొత్తగూడెం వెపుకు వెలుతుంటాయి. దీనిలో ఏ బస్సు ఖాళీగా వెల్లదు. ఆటోలు టాటా మ్యాజిక్‌లలో సగటున దాదాపు వెయ్యి మంది నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. ప్రాణాంతకర ప్రయాణాలు అయిన ప్రజలకు తప్పడం లేదు. కనుక రైల్వే స్టేషన్‌ను కనీసం కూనవరం రైల్వే గేట్ వద్దకు తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. దీని వల్ల సుమారు పాతికవేల మందికి రైలు అందుబాటులోకి వస్తుంది. మాజీ ఎంపీలు అనేకమంది వాగ్దానాలు చేసిన వారే. వీరి ద్వారా అనేక లేఖలు ఈ విషయంపై రైల్వేశాఖకు చేరాయి. సరైన ఒత్తిడి లేక ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. సింగరేణి ఉద్యోగులు, కార్మిక సంఘాలు రైల్వే శాఖకు పలు వినతులు చేరాయి. అయినా ఫలితం శూన్యంగా మారింది.



మణుగూరు రైల్వేస్టేషన్